# ఎచీవర్స్ డే

అన్ని మార్గాలు మూసివేయబడినట్టున్న తరుణంలో, ఏదిక్కు తోచని ఆయోమయ స్ధితిలోంచి ఉద్భవించిన భావ రూపమే ఈనాడు మన మానవ జాతిని శోభింప చేస్తున్న టెక్నాలజీ, ఈ వైజ్ఞానిక పరికరాలే మన శాంతి సుఖ సోపానాలు.

ఆత్మ జ్ఞానం, సామాజిక స్పృహ, నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే సాంకేతిక విశ్వవిద్యాలయపు ప్రధమ కర్తవ్యం. విద్య, జ్ఞానం టెక్నాలజీని అందిస్తే, ఈ రోజు టెక్నాలజీ సరిక్రొత్త విద్యను జ్ఞానాన్ని అందిస్తోంది. మానవజాతి కనివినీ ఊహించని రీతిలో భౌతిక, మానసిక ఉల్లాసాలకు కావలసిన వన్నీ టెక్నాలజీ సమకురుస్తోంది. టెక్నాలజీ మూలంగా మనిషి చేపలా ఈదగలుగుతున్నాడు. పక్షిలా ఎగరగలిగాడు, మిషన్ లా పనిచేస్తున్నాడు, కంప్యూటర్ లా నేర్పరి అయ్యాడు కానీ ఈ హడావిడిలో మనిషి మనిషిలా జీవించడం మరిచిపోయాడు. మానవత్వం గుబాళించే మనిషి కనుమరుగు అవుతాడేమో అన్న రోజులు వచ్చాయి. మనిషిలో ఆలోచన దృక్పధంలో వచ్చిన మార్పులు, అనాదిగా వచ్చిన అలవాట్లు, ధోరణులను పక్కకు నెట్టాయి. అందుకే విభిన్న రంగాల్లో నిష్ణాతులైన ఎచీవర్స్ - టీచర్స్ మరియు స్టూడెంట్స్ ఈ విషయమై తగు ఆలోచన చేసి అసలు జీవితం దేనికి ? విజయం అంటే ఏమిటి విద్యకు సార్ధకత ఏది అని ఆలోచించే సమయం ఆసన్నమయింది.

శాంతి కాముకులమైన మనం మనందరిదీ ఒకటే కులం, అదే 'మానవకులం' అనే ధోరణిలో మన శక్తి యుక్తులను, ప్రతిభాపాటవాలను విశ్వశాంతిపై విశ్వశ్రేయస్సుకై వినియోగించాలి. విద్యా వైజ్ఞానికాలు ఏ ఒక్క స్పెషలైజేషన్ సొత్తుకాదు, అందరి సొత్తు ! హ్యుమానీటీస్, సోషల్ సైన్స్, ఎకానామిక్స్, ఇంజనీరింగ్, సైన్స్, బయోటెక్నాలజీ, మెడిసిన్, లా ..అన్ని రంగాలూ అనుసంధానమైతేనే మానవజాతి మనుగడ సాధ్యం. ఆలోచనలు జిల్లా, రాష్ట్ర దేశ, భూగోళ అవధాలను అధిగమించాలి. "జగదైక కుటుంబం" అనే భావం నర నరాల్లో జీర్ణమై పోవాలి.

మన ప్రతీ పనీ సర్వకాల సర్వావస్థల యందు సర్వజన ఆమోదయోగ్యంగా, భావితరాల మనుగడకు కూడా ఉపయోగకరంగా ఉండాలి. ఎచీవర్స్ ఆలోచనలకు హద్దులు ఎల్లలు లేవు. వినీలా కాసం ఆవలగల ప్రపంచం కూడా మనదే. శోధించి చేదించి సాధించాలి. అయితే అన్నిరంగాలకు సముచిత స్ధానాన్నిచ్చి, విలువనిచ్చే ఆలోచనలే మానవజాతి సర్వతో ముఖాభివృద్ధికి ఆయువుపట్టు.

అసలు ఎచీవర్స్ అంటే ఎవరు ? మనం సాధించవలసినది ఏమిటి ? సాధకుడు అంటే ఎవరు ? ఏదైనా సాధించడానికి ఎల్లలున్నాయా ? సాదించనలేనివి కాని పనులు ఈ ఇలలో ఉన్నాయా ? లక్షణం ఇతి లక్ష్యం. మన లక్షణాలే మన లక్ష్యాన్ని నిర్దేశిస్తాయి. అలాగే ఒక వ్యక్తి సాధనే అతన్ని సాధకుడిని ఎచీవర్ ని చేస్తాయి. అకుంఠిత దీక్ష నిరంతర సాధన, సంకల్పబలం ఇవే సామాన్యుడిని అసామాన్యుడిగా తీర్చిదిద్దుతాయి, వీటికి సామాజిక స్పృహతో డైతే పరిపూర్ణమైన మానవుడిగా మలుస్తాయి.

"భోధకుడు భోధిస్తాడు, విద్యార్ధి నేర్చుకుంటాడు" అనే పాత రోజులు పోయాయి, ఈ రోజున విషయాన్ని తానే స్వయంగా చర్చించుకుని తనకుతానే నేర్చుకునే విద్యార్ధి మాత్రమే టెక్నాలజీలో రాణించగలడు. టీచరు ఒక దిశను మాత్రమే చూపించగలడు. ఒక గైడ్ మాత్రమే. విశ్లేషించి అర్ధం చేసుకోవడం విద్యార్ధి బాధ్యత ప్రస్తుత కాలంలో సృజనాత్మకత, ప్రకృతిపై ఆరాధన, నిరాండబరత, హుందాతనం, సర్వమానవ సౌభ్రాతృత్వం, సకల ప్రాణుల పట్ల గౌరవం, అరమరికలు లేని స్వచ్ఛమైన ప్రేమ, సామాజిక భాద్యత అన్నీ కలిసి, వెరసి 'మానవత్వం-దీన్ని ప్రామాణికంగా, మూలంగా తీసుకున్న సాంకేతిక విద్యను అందించే విశ్వవిద్యాలయమే జె.ఎన్.టి.యు.కె